తెలంగాణ TELANGANA MUCHATLU

# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 06 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 94 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నకిరేకల్‌లో రూ.32 కోట్ల ఆసుపత్రి ప్రారంభం.. అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన
- రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు
- నకిరేకల్‌లో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి ప్రారంభం
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- రైతులు, మహిళలు, నిరుద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్న సీఎం

**నల్గొండ, సెప్టెంబర్ 05, (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా పాలన పేదలు, రైతులు, మహిళలు, నిరుద్యోగుల అభ్యున్నతికే అంకితమై పనిచేస్తోందని పేర్కొన్నారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల నూతన ప్రాంతీయ ఆసుపత్రిని శనివారం ప్రారంభించిన ముఖ్యమంత్రి, అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాజీవ్ గాంధీ మినీ స్టేడియంలో నిర్వహించిన వెయ్యి రోజుల ప్రజాపాలన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, మహిళా, యువజన సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, సన్నవడ్లకు బోనస్ వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మహిళలకు ఆర్థిక సాధికారత కల్పించే కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని కొందరు విమర్శించినా, ఈ పథకం నిరంతరం కొనసాగుతుందని సీఎం స్పష్టం చేశారు. సూర్యుడు ఉదయించినంతకాలం, చంద్రుడు ఉన్నంతకాలం ఈ పథకం అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

మిగతా.. 2లో

# విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్
- అసెంబ్లీలో విద్యార్థుల సమస్యలపై పోరాడతామన్న హరీశ్‌రావు

**సిద్దిపేట, సెప్టెంబర్ 5, (తెలంగాణ ముచ్చట్లు)**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన పూర్తిగా వైఫల్యాలతో నిండిపోయిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

మిగతా 2లో..





# ఉపాధ్యాయులకు సీఎం భరోసా

- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి హామీ
- తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని పిలుపు
- పీఆర్సీ, ఇంక్రిమెంట్లతో పాటు అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్న సీఎం
- నైపుణ్య ఆధారిత విద్యకు ప్రాధాన్యం
- పాలిటెక్నిక్ విద్యలో సంస్కరణలపై స్పష్టత

**కొడంగల్, సెప్టెంబర్ 5, (తెలంగాణ ముచ్చట్లు):**

ఉపాధ్యాయులు మరో రెండేళ్లపాటు సహకరించి ప్రభుత్వానికి వెసులుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్లతో పాటు వారి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తెలంగాణ విద్యా వ్యవస్థను దేశానికి ఆదర్శంగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, ఆదర్శ ఉపాధ్యాయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం, రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. విద్యాశాఖ మిగతా శాఖలకు ఆదర్శంగా నిలవాలని, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రెండేళ్ల సమయం ఇస్తే ఉపాధ్యాయులు అడక్కుండానే వారి సమస్యలను సామరస్యంగా పరిష్కరించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, తెలంగాణ విద్యా రంగ పురోగతిలో వారు కీలక పాత్ర పోషించాలని కోరారు.

తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులంతా పునరంకితం కావాలని సీఎం పిలుపునిచ్చారు. ఇంట్లో సొంత పిల్లల పట్ల చూపే శ్రద్ధనే పాఠశాలల్లోని విద్యార్థుల పట్ల కూడా చూపించాలని సూచించారు. ఉపాధ్యాయులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేయడం ప్రభుత్వం, రాష్ట్రానికి శుభ సూచకం కాదని పేర్కొన్నారు. పీఆర్సీ, ఇంక్రిమెంట్లు, ఇతర సర్వీస్ అంశాల్లో ఉపాధ్యాయులు, లెక్చరర్లకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వబోమని హామీ ఇచ్చారు.

మిగతా 2లో..

# హైదరాబాద్‌లో 70 వేల కోట్ల ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్ట్

- హైదరాబాద్‌లో 1 గిగావాట్ సామర్థ్యంతో ఏఐ డేటా సెంటర్ క్యాంపస్
- రూ.70 వేల కోట్ల పెట్టుబడులు, 7 వేల ఉద్యోగాల అంచనా
- తెలంగాణకు ప్రపంచ ఏఐ కేంద్రంగా గుర్తింపు: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 5, (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణలో భారీ పెట్టుబడులకు మరో కీలక ప్రాజెక్ట్ దక్కింది. టీసీఎస్‌కు చెందిన హైపర్‌వాల్ట్ సంస్థ హైదరాబాద్‌లో 1 గిగావాట్ సామర్థ్యంతో భారీ ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. 250 ఎకరాలకు పైగా విస్తరించే ఈ ప్రాజెక్ట్‌లో హైపర్‌వాల్ట్ మరియు భాగస్వామ్య సంస్థలు కలిపి రూ.70 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా అత్యాధునిక కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్న అంతర్జాతీయ సంస్థలు, హైపర్‌స్కేలర్లు, ప్రపంచ స్థాయి కంపెనీలకు అవసరమైన కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

మిగతా 2లో..



# అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరుకావాలి

- మంత్రి వివేక్ వెంకటస్వామి
- గజ్వేల్‌లో కాంగ్రెస్ శ్రేణులతో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ
- ప్రజా సమస్యలపై సభలో చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్షానిదేనని వ్యాఖ్య


2లో

# కేటీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

- కరీంనగర్ పర్యటనలో ఘటన
- లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న కారు
- సురక్షితంగా బయటపడ్డ కేటీఆర్
- ఊపిరి పీల్చుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

**కరీంనగర్, సెప్టెంబర్ 05, (తెలంగాణ ముచ్చట్లు):**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు శనివారం తృటిలో రోడ్డు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కరీంనగర్‌లో నిర్వహించిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొనేందుకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర మహాసభ కరపత్రాల ఆవిష్కరణ






- **మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎంపీ పసునూరి దయాకర్‌కు ఆహ్వానం**

**హన్మకొండ, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర 3వ మహాసభను ఈ నెల 12న హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఫోరమ్ నాయకులు తెలిపారు. మహాసభను విజయవంతం చేసేందుకు రాష్ట్ర నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ సందర్భంగా ఫోరమ్ నాయకులు హన్మకొండలో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్యను, మాజీ ఎంపీ పసునూరి దయాకర్‌ను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి మహాసభకు ఆహ్వానించారు. అనంతరం మహాసభకు సంబంధించిన కరపత్రాలను వారి చేతుల మీదుగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ, మాదిగ జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగుతూ తమ హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని అన్నారు. సమాజంలోని సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరమ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న కృషి అభినందనీయమని, మహాసభ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సామాజిక న్యాయం కోసం పాత్రికేయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. మాదిగ జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంక్షేమం కోసం ఫోరమ్ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర 3వ మహాసభకు పెద్ద సంఖ్యలో పాత్రికేయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.మహాసభలో జర్నలిస్టుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి తదితర అంశాలపై చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్, రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొల్లెపాక రాజేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్, రాష్ట్ర నాయకులు పసుల తిరుపతి, జిల్లా అధ్యక్షులు సందెలా రాజు, నాయకులు భాస్కర్, హన్మకొండ శ్రీకాంత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యం.. పాదయాత్ర ఆరంభమే.. సాధించే వరకు పోరాటం

- **మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం: కాంగ్రెస్ నేతలు**
- **జర్నలిస్టుల ప్రతి పోరాటానికీ అండగా ఉంటాం: వామపక్షాలు**
- **టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్రకు పార్టీలు, ప్రజాసంఘాల సంఘీభావం**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిగే రఘు, బి.రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్, కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్ర ఆరంభం మాత్రమేనని, సమస్య పరిష్కారమయ్యే వరకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు.

టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గత నెల 22న ప్రారంభమైన పాదయాత్ర శనివారం ఖమ్మం నియోజకవర్గంలో కొనసాగింది. అనంతరం ఎస్ఆర్ గార్డెన్ పార్కింగ్ స్థలంలో ముగింపు సభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన జర్నలిస్టులు కూరాకుల గోపి, సత్యానందం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు జర్నలిస్టుల చిరకాల వాంఛ అని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు వచ్చే జర్నలిస్టులను అడ్డుకోవడం సరికాదన్నారు. అవసరమైతే నిరాహార దీక్షలకూ సిద్ధమని పేర్కొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను జిల్లా మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని చెప్పారు.

జర్నలిస్టుల ప్రతి పోరాటానికీ మద్దతుగా నిలుస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకుడు ఎర్రబాబు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేత సీవై పుల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మధు తదితరులు తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలకు కూడా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పాదయాత్రలో భాగంగా ఖమ్మం అర్బన్, రూరల్, రఘునాథపాలెం తహశీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయం నుంచి కాల్వొడ్డు, మయూరి సెంటర్, వైరా రోడ్డు, ఇల్లందు క్రాస్‌రోడ్ మీదుగా రఘునాథపాలెం తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర సాగింది. మార్గమధ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపాయి. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు, సభ్యులతో పాటు 200 మందికి పైగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

కొత్త రేషన్ కార్డుల జారీ, 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, పంపుసెట్లకు ఉచిత విద్యుత్ వంటి పథకాలు వివక్ష లేకుండా అందరికీ అందుతున్నాయని చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గ అభివృద్ధికి భారీ ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. కడపర్తి గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి, రూ.9.85 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే మునిపంపుల, గుడివాడ గ్రామాల్లో కొత్త సబ్‌స్టేషన్లు, విద్యుత్ లైన్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. విద్య, విద్యుత్ రంగాల్లో నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

నకిరేకల్ మండలంలో రూ.20 కోట్లతో సమీకృత మండల స్థాయి కార్యాలయాల సముదాయం నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.45.60 కోట్లతో రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నకిరేకల్-గురజాల రహదారి నుంచి బైరౌనిబండ, అమ్మనబోలు-రామాంజాపూర్ ప్రాంతాల వరకు రహదారులను విస్తరించి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పలువురు ఎంపీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నకిరేకల్‌తో పాటు నల్గొండ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతంగా కొనసాగుతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయులకు సీఎం భరోసా

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని విమర్శించిన సీఎం, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీలను వివాదరహితంగా పూర్తి చేశామని చెప్పారు. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను కల్పించామని వివరించారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి అనుభవం కల్పించేందుకు విదేశీ అధ్యయన పర్యటనలు నిర్వహించామని, విద్యా కమిషన్ ఏర్పాటు చేసి కొత్త విద్యా విధానానికి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి ఆధారిత విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని సీఎం చెప్పారు. పాలిటెక్నిక్ విద్యను నైపుణ్య విశ్వవిద్యాలయ పరిధిలోకి తీసుకురావడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్‌లో రెండేళ్లు సిద్ధాంత విద్య, మూడో సంవత్సరం కార్పొరేట్ సంస్థల్లో శిక్షణ పొందే విధానాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులకు స్టయిఫండ్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యాలు కలిగిన యువతకు డిమాండ్ పెరుగుతోందని సీఎం పేర్కొన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో సాంకేతిక నైపుణ్యాలు కలిగిన వారికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు జ్ఞానం, సంభాషణా నైపుణ్యాలతో పాటు ఉపాధి ఆధారిత శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేలకుపైగా అదనపు అడ్మిషన్లు నమోదవడం ఉపాధ్యాయుల కృషికే నిదర్శనమని కొనియాడారు. తెలంగాణను విద్యా రంగంలో దేశానికి మార్గదర్శకంగా నిలబెట్టేందుకు ఉపాధ్యాయులంతా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరుకావాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి

**సిద్దిపేట, సెప్టెంబర్ 05, (తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం నిర్వహించిన భారీ ద్విచక్ర వాహన ర్యాలీలో రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ రాష్ట్ర రాజకీయాలు, అసెంబ్లీ సమావేశాలు, ప్రజా సమస్యలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రానున్న అసెంబ్లీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధిగా, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించడం ఆయన బాధ్యత అని అన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలను విస్మరించి రాష్ట్రంపై భారీ అప్పుల భారం మోపారని మంత్రి విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసిన గత ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల అభివృద్ధి కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు గెలిపించినప్పటికీ కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేకపోవడం విచారకరమని వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించడం, ప్రజలతో మమేకం కావడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొన్నారు.

అసెంబ్లీకి రాకుండా బయట నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే సభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి పిలుపునిచ్చారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజా పాలన ద్వారా తెలంగాణ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తామని ఆయన తెలిపారు.

## గురువులే భవిష్యత్ తరాలకు దిక్సూచి



- **హిమ్మత్‌నగర్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**వీణవంక, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** గురువుల పట్ల గౌరవాన్ని చాటుతూ కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్ ఎంపీయూపీఎస్ విద్యార్థులు ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ గురువులకు ఘనంగా సన్మానం చేశారు.తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలు, పూలబొకేలతో సత్కరించి గురువుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గోనె సత్యం మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో విద్యతో పాటు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై శ్రద్ధగా విద్యను అభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే విద్యాబుద్ధులను ఆచరిస్తూ క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. గురువుల మార్గదర్శకత్వంలోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం

(మొదటి పేజీ తరువాయి)

మూడేళ్లుగా ప్రభుత్వం ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా విడుదల చేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు. గజ్వేల్‌లోని శ్రీకృప ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఫీజులు అందకపోవడంతో యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో పలువురు విద్యార్థులు ఉన్నత విద్యావకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఏడాది సుమారు రూ.2 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించిందని గుర్తుచేశారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.20 వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఖర్చు చేసి పేద విద్యార్థులను ఇంజినీర్లు, వైద్యులుగా తీర్చిదిద్దిందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో పెండింగ్‌లో పెట్టిన బకాయిలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే చెల్లించిందని చెప్పారు. కానీ ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ఫీజులు విడుదల కాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు మూతపడగా, సిద్దిపేటలోనే ఐదు డిగ్రీ కళాశాలలు కార్యకలాపాలు నిలిపివేశాయని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కూడా అందించలేకపోయారని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్నారని ఆరోపిస్తూ, విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని హరీశ్‌రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, ఆచరణలో మాత్రం చాలా తక్కువ ఉద్యోగాలకే పరిమితమైందన్నారు. మహిళలకు, వృద్ధులకు, యువతకు ఇచ్చిన పలు హామీలు కూడా అమలు కాలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడూ నిలబడుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, జీవో 97 రద్దు అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేస్తే సహించబోమని హెచ్చరించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## ..70 వేల కోట్ల ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్ట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత సుమారు 7 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నట్లు అంచనా వేస్తున్నారు.

ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రతినిధులతో సమావేశమైన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి దీనిని తెలంగాణకే కాకుండా దేశానికి కూడా చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. “హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ ఏఐ విప్లవంలో ముందంజలో ఉందని ఈ ప్రాజెక్ట్ నిరూపిస్తోంది. ఈ దశాబ్దం కృత్రిమ మేధ సాంకేతికతదే. ఏఐ మోడళ్లు, కంప్యూటింగ్ సామర్థ్యం ప్రజా మౌలిక సదుపాయాలుగా మారుతున్న సమయంలో అవి తెలంగాణలో ఉండటం రాష్ట్రానికి ప్రత్యేక ప్రయోజనం కల్పిస్తుంది” అని సీఎం పేర్కొన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా మరోసారి నిలిచిందన్నారు. ప్రపంచ స్థాయి సంస్థల అవసరాలకు అనుగుణంగా వేగంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో తెలంగాణ ఈ ప్రాజెక్ట్‌ను సాధించగలిగిందని తెలిపారు. ఈ ఒప్పందానికి పునాది ఈ ఏడాది దావోస్ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌ల మధ్య జరిగిన చర్చలతో పడిందన్నారు.

# గురువులే భావితరాలకు దిక్సూచి

- **ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో సత్తు మల్లేశం నివాళి**



**కరీంనగర్, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):**ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయంలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అమూల్యమని, సమాజ అభివృద్ధికి విద్యే పునాది అన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గురువు చూపే మార్గం.. విద్యార్థి జీవితానికి వెలుగుబాట" అని సత్తు మల్లేశం పేర్కొన్నారు.

# ఎస్సీ సెల్ కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేత



- **పార్టీ బలోపేతానికి కృషి చేయాలి – ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**మానకొండూర్, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):**మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం ఎల్.ఎం.డి ప్రజాభవన్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల, జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ సెల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు



- **విద్యతో పాటు విలువలు, సంస్కారం, క్రమశిక్షణను అందించేది గురువులే**
- **పలుస శంకర్ గౌడ్ జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**

**వనపర్తి,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని శ్రీనివాస్పూర్ మండల పరిషత్ పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సాహితీ కళావేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శంభావి, ఉపాధ్యాయులు శ్వేత, రాజేశ్వరిలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు అని అన్నారు. గురువులు విద్యార్థులకు విద్యతో పాటు విలువలు, సంస్కారం, క్రమశిక్షణను నేర్పి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తారని పేర్కొన్నారు.ముగ్గురు ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని, వారి మార్గదర్శకత్వంలోనే విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు.పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని కౌన్సిలర్లు విభూతి మహేశ్వరి, ముదావత్ శంకరమ్మ, బాబు నాయక్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మల రాములు, గ్రామ పెద్దలు లక్ష్మయ్య, రాములు, వినయ్, తిరుపతి, రమేష్, శాంతన్న, ఆంజనేయులు, తల్లిదండ్రులు, పాఠశాల నిర్వహణ సంఘం సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జి. గౌరి, టి. సూర్యకుమారి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జీపీఎస్ స్తంభాని నగర్ పాఠశాలకు చెందిన జి. గౌరి, టి. సూర్యకుమారి ఎంపికయ్యారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, డీఈఓ సదానందం చేతుల మీదుగా వారు మెమెంటో, ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి వారు చేస్తున్న విశేష కృషిని గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తూ, విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడంలో వారు చేస్తున్న కృషికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది.

జి. గౌరి, టి. సూర్యకుమారిలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు లభించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు ఉపాధ్యాయులు, విద్యాభిమానులు అభినందించారు.

# బీసీ ఫెడరేషన్లకు చైర్మన్లు, పాలక మండళ్లు ఏర్పాటు చేయాలి

- **తెలంగాణ బీసీ కులాల సమితి ప్రభుత్వానికి వినతి**



**వనపర్తి,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):**తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడంతో పాటు పాలక మండళ్లను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ కులాల సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల అభివృద్ధి, సంక్షేమం కోసం పలు ఫెడరేషన్లు, కార్పొరేషన్లను ఏర్పాటు చేసినప్పటికీ, వాటికి పూర్తిస్థాయిలో చైర్మన్లు, పాలక మండళ్లు లేకపోవడంతో ఆయా వర్గాల సమస్యలు పరిష్కారం కావడంలో జాప్యం జరుగుతోందని సమితి ప్రతినిధులు తెలిపారు. బీసీ వర్గాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలు మరింత సమర్థవంతంగా అమలు కావాలంటే పాలక మండళ్ల ఏర్పాటు అత్యవసరమని పేర్కొన్నారు.గతంలో ప్రభుత్వం వివిధ బీసీ కులాలకు సంబంధించిన ఫెడరేషన్లను ఏర్పాటు చేసి సంక్షేమ కార్యక్రమాలకు మార్గం సుగమం చేసిందని, ప్రస్తుతం వాటికి చైర్మన్లు, పాలక మండళ్లను నియమించడం ద్వారా బీసీ వర్గాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. అర్హత, సామాజిక సేవ, అనుభవం ఉన్న బీసీ నాయకులకు చైర్మన్ పదవులతో పాటు పాలక మండళ్లలో అవకాశం కల్పించాలని వారు కోరారు. అన్ని బీసీ కులాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రభుత్వం త్వరితగతిన నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు సమితి నాయకులు ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసి తమ డిమాండ్లను వివరించారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ఫెడరేషన్లను బలోపేతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కులాల సమితి అధ్యక్షులు శ్రీ దుర్గా రావు, ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, రాష్ట్ర కార్యదర్శి మరియు హైదరాబాద్ అధ్యక్షులు వన్నెం శంకర్, శ్రీకాంత్ చారీ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయకుండా విద్యార్థులను మోసం చేశారు

- **1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా వనపర్తిలో విద్యార్థుల నిరసన ర్యాలీ**



**వనపర్తి,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా మోసం చేసిందని బీఆర్ఎస్వీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు నిరసనగా శుక్రవారం వనపర్తిలో విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా హేమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థులు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు, యువత సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు ద్విచక్ర వాహనాలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, యువజన కమిషన్, రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.విదేశీ విద్యకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలని కోరారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, ఫీజు తిరిగి చెల్లింపులు, పెండింగ్ ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు.యువజన ప్రకటనలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు తిరిగి చెల్లింపులను వెంటనే విడుదల చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్వీ వనపర్తి ఇన్‌చార్జి సూర్యవంశం గిరి, బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల ఇన్‌చార్జి సునీల్ వాల్మీకి, శివ గౌడ్, సిరివాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, మాజీ కౌన్సిలర్ ఉంగుళం తిరుమల్ తదితరులు పాల్గొన్నారు. వివిధ మండలాల నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, యువజన నాయకులు, బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా స్వాతి ఎంపిక కావడం గర్వకారణం

- **భరత్ భూషణ్ బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు**



**కొత్తకోట,సెప్టెంబర్05( తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన జె. స్వాతి కిరణ్ కుమార్ను బీజేపీ మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము భరత్ భూషణ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వాతిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కొమ్ము భరత్ భూషణ్ మాట్లాడుతూ.. పేద బీడీ కార్మిక కుటుంబంలో జన్మించిన స్వాతి కష్టపడి చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడి, తన సేవలతో వనపర్తి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. పుట్టిన ఊరు కొత్తకోటతో పాటు మెట్టిన ఊరు అమరచింతకు కూడా స్వాతి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు.ప్రస్తుతం ఎం.పి.పి.ఎస్. శంకరమ్మపేటలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న స్వాతి, విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందడం ఎంతో సంతోషకరమని భరత్ భూషణ్ పేర్కొన్నారు. ఆమె మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, విద్యార్థుల భవిష్యత్తుకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏలీయా బీజేపీ నాయకులు, బోరింగ్ రాములు, మున్సిపల్ కార్మికులు శ్రీమతి శాంతమ్మ జార్జ్, శ్రీమతి పల్లెపొగు రాజేశ్వరి విజయ్ తదితరులు పాల్గొని స్వాతికి అభినందనలు తెలిపారు.

# ఘనంగా మదర్ థెరిసా 29వ వర్ధంతి



**కాజీపేట్ సెప్టెంబర్ 5 ( తెలంగాణ ముచ్చట్లు):** పునీత మదర్ థెరిస్సా 29వ వర్ధంతిని పురస్కరించుకొని కాజీ పేట లోని ఫాతిమా జంక్షన్ లో నున్న మదర్ థెరిస్సా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి కొవ్వొత్తులు వెలిగించి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫాతిమా చర్చ్ విచారణ గురువు కాసు మర్రెడ్డి ప్రార్థనలు జరిపారు. మదర్ తెరిసా వర్ధంతి తో పాటు 9 వ సెంట్ వుడ్ పునీతులుగా ఆమె సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తెలుగు అకాడమీ చైర్మన్ పుల్లూరు సుధాకర్ ప్రెసిడెంట్ ఫోరమ్ ఫర్ బెటర్ వరంగల్ డాక్టర్ తిరునహరి శేషు విగ్రహ కమిటీ కన్వీనర్ ఆర్ రాజ మోహన్ రావు, ప్రకాష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, భాస్కర్, దయాసాగర్, ఇన్నరెడ్డి, నాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# గోవింద నామస్మరణతో మార్మోగిన కొండలయ్య గుట్ట

- **శ్రావణ చివరి శనివారం స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు**





**పెద్దమందడి,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం జగత్‌పల్లి కొండలయ్య గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శ్రావణ మాసపు చివరి శనివారం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. స్వామి వారి దర్శనం కోసం జగత్‌పల్లి గ్రామస్తులతో పాటు వనపర్తి మండలంలోని రాజనగరం, నాగవరం, రాజపేట, వనపర్తి పట్టణాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. గుట్ట కింద కొలువైన అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు ఏడుకొండలవాడా.. వెంకటరమణా.. గోవిందా..గోవిందా అంటూ గోవింద నామస్మరణతో కొండపైకి చేరుకున్నారు. భక్తుల నామస్మరణతో కొండలయ్య గుట్ట మార్మోగింది. కొండపై స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం చిన్న తిరుమలను తలపించింది.శ్రావణ శనివారం స్వామివారిని దర్శించుకుంటే పాపాలు తొలగి, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. జగత్‌పల్లి గ్రామానికి చెందిన దాత గట్టు నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అన్నదానం చేయడం పట్ల దాతను పలువురు అభినందించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంటన్న యాదవ్, మాజీ సర్పంచులు మోహన్ కుమార్ యాదవ్, నిరంజన్ గౌడ్, నారాయణ యాదవ్, గ్రామ ప్రముఖులు బూరుగుపల్లి శ్రీనివాసరెడ్డి, జి. శ్రీనివాస యాదవ్, వార్డు సభ్యులు మోజర్ల రాములు, కుమార్ యాదవ్, దత్తాత్రేయ రెడ్డి, కృష్ణ సాగర్, సురేష్ చారి, బుచ్చన్న నాయుడు, వెంకటేష్ నాయుడు, తుప్పుడ భాస్కర్ యాదవ్, తిరుపతి నాయుడు, కృష్ణుడు, చంద్రుడు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ



- పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**మానకొండూర్,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు ):** మండల కేంద్రంలోని కేఎస్ ఫంక్షన్ హాల్‌లో మానకొండూర్ మండలానికి చెందిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, స్మార్ట్ రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు సులభంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ పేద కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన లబ్ధిదారులు ఎవరూ మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తాటికాయలలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు




- ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను సన్మానించిన పెసరు రమేష్

**ధర్మసాగర్,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** గురుపూజోత్సవం (టీచర్స్ డే) సందర్భంగా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ధర్మసాగర్ మండల అధ్యక్షులు పెసరు రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెసరు రమేష్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారిని సన్మానించడం ఎంతో గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో తాటికాయల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. ఫాతిమా మేరితో పాటు ఉపాధ్యాయులు నవీన్ కుమార్, ఉషారాణి, పాశికంటి శ్రీనివాస్, వసుంధర, బండి రాజు, దీప్తి, ఇంద్రాణి రాజు, హేమలత, యామిని, భాగ్యలక్ష్మి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాటికాయల ఉపసర్పంచ్ పెసరు శివకృష్ణ, వార్డు సభ్యులు పెసరు స్వామి, పిట్టల రంజిత్, బొల్లెపాక సంపత్, దువ్వల సుమన్, కృష్ణవేణి, బుల్లయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ నీల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఆదర్శలో స్వయంపాలన దినోత్సవం



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నాగులవంచ శ్రీ ఆదర్శ హై స్కూల్లో శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రను పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉన్నత భావాలతో ఆదర్శవంతంగా ఎదగాలని ఆయన సూచించారు. విద్యార్థులే ఉపాధ్యాయుల అవతారాలు ఎత్తి రోజంతా పాఠాలు బోధించారు. విద్యార్థుల పాఠ్యాంశ బోధన ఆకట్టుకుంది. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. బోధనలో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు జొన్నలగడ్డ శ్రీనివాస్, బోళ్ళ రేణుక, అమరబోయిన సురేష్, పార్వతి, చందన, రాశి, సుజిత, శైలజ పాల్గొన్నారు.

# కరీంనగర్ నుంచే కాంగ్రెస్‌పై సమరభేరి:కేటీఆర్

- యువత పిడికిలి బిగిస్తే పిడుగుల వర్షమే
- హామీలు అమలు చేయని రేవంత్ ప్రభుత్వం రాజీనామా చేయాలి






**కరీంనగర్, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన 'పోరుబాట' కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యువ సమరభేరిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.
తెలంగాణ తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా? 1000 రోజులు గడిచినా హామీలు అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలా? అని ప్రశ్నించారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి, యువతకు రూ.10 లక్షల రుణాలు, యూత్ కమిషన్, ప్రైవేట్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ వంటి హామీల పరిస్థితి ఏమిటని నిలదీశారు. 'జాబ్ క్యాలెండర్ లేదు.. స్కామ్ క్యాలెండర్ నడుస్తోంది' అంటూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు.
కరీంనగర్ పోరాటాలకు పురిటిగడ్డ అని, యువత పిడికిలి బిగిస్తే పిడుగుల వర్షం కురుస్తుందని కేటీఆర్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గల్లా పట్టి నిలదీస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, బోయినపల్లి వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సతీష్‌కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

- విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం



**కరీంనగర్, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యాధికారి చైతన్య జైని తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.
విశిష్ట సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంలో ఉపాధ్యాయుల కృషిని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.
ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాఠ్యాంశాల బోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించడంలో గురువులు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ విద్య, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పురస్కారాలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి కొనసాగుతున్న చేరికల పరంపర

- కాట్రపల్లిలో భారీగా చేరికలు.. మహిళా విభాగం నూతన కమిటీ ఏర్పాటు



**హుజురాబాద్, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత భారీగా చేరుతున్నారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా, జిల్లా అధ్యక్షురాలు గంగిపెల్లి అరుణ, జిల్లా కార్యదర్శి దాట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు హుజురాబాద్ మండల అధ్యక్షుడు *తిరగమల్ల నాగార్జున* ఆధ్వర్యంలో శనివారం హుజురాబాద్ మండలం కాట్రపల్లి గ్రామంలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పురుషులు, మహిళలు తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి తిరగమల్ల నాగార్జున పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.
అనంతరం కాట్రపల్లి గ్రామ తెలంగాణ రాజ్యాధికార పార్టీ మహిళా విభాగం కమిటీని ఏర్పాటు చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలుగా మాడుగుల శ్రీ విద్య, ప్రధాన కార్యదర్శిగా మైస సరితను నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున మాట్లాడుతూ పార్టీ పదవులను కేవలం హోదాగా భావించకుండా బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుండి వారి గొంతుకగా మారాలని, గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని అన్నారు.హుజురాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని మరింత బలోపేతం చేసి, భవిష్యత్తులో అధికారంలోకి తీసుకువచ్చే వరకు నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలు కూడా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల రాజు, మండల అధికార ప్రతినిధి బొడ్డు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా లక్ష్మణస్వామి



- 24 ఏళ్ల సేవలకు దక్కిన గౌరవం

**జగిత్యాల, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన వోడ్నాల లక్ష్మణస్వామి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డును అందుకున్నారు.
నిరుపేద పద్మశాలి కుటుంబంలో జన్మించిన లక్ష్మణస్వామి చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ క్లాస్ ఫస్ట్‌గా నిలిచేవారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా పట్టుదలతో చదువును కొనసాగించి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయన, తన వృత్తి జీవితంలో విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారు.
గత 24 సంవత్సరాలుగా ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న లక్ష్మణస్వామి క్రమశిక్షణ, అంకితభావంతో విద్యాబోధన చేస్తూ విద్యార్థులలో విద్యా నైపుణ్యాలతో పాటు మంచి విలువలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన విద్యాశాఖ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసింది.
జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి (DEO) చేతుల మీదుగా లక్ష్మణస్వామికి అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చి 24 ఏళ్లుగా నిబద్ధతతో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న లక్ష్మణస్వామి సేవలు అభినందనీయమన్నారు. యువ ఉపాధ్యాయులకు ఆయన స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు.
అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి కూడా లక్ష్మణస్వామి విద్యారంగానికి అందిస్తున్న సేవలను అభినందించారు. తన సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంపై లక్ష్మణస్వామి సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని తెలిపారు.
తాడికల్ గ్రామానికి చెందిన వ్యక్తి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడంతో గ్రామస్తులు, పద్మశాలి సంఘం నాయకులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబం నుంచి ప్రారంభమైన లక్ష్మణస్వామి ప్రస్థానం 24 ఏళ్ల అంకితభావంతో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి స్థాయికి చేరడం పలువురికి ఆదర్శంగా నిలిచింది.

# స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఉత్సాహంగా స్వయంపాలన దినోత్సవం

- విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాల బోధన




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవంను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులు బోధించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రత్యేక వస్త్రధారణలో డిఈఓ గా, హెడ్మాస్టర్ గా పలు సబ్జెక్టుల ఉపాధ్యాయులుగా, పిఈటిలుగా,అటెండర్ గా వ్యవహరించి విద్యార్థులకు పాఠాలను బోధించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల పని తీరును తెలుసుకోవడానికి స్వయంపాలన దినోత్సవం నిర్వహించామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తున్న తీరును స్వయంపాలన దినోత్సవం ద్వారా తెలియజేశామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గురువుగా విద్యార్థులను తీర్చిదిద్ది, భారత రెండవ రాష్ట్రపతిగా విధులు నిర్వహించి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని తెలియజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులందరినీ పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య,ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు,విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
ఆదివారం - 06 - సెప్టెంబర్ - 2026


# శ్రీ గ్లోబల్ హై స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



- ***సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడిన పాఠశాల డైరెక్టర్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండలం నాగుల వంచలోని శ్రీ గ్లోబల్ హై స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఇనుకుల్ల దివాకర్ రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను, విద్యారంగానికి చేసిన కృషిని కొనియాడారు.
ఈ సందర్భంగా దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యత, ఆత్మవిశ్వాసం వంటి సద్గుణాలను పెంపొందిస్తూ సమాజానికి మంచి పౌరులను అందిస్తారని తెలిపారు. గురువుల మార్గదర్శకత్వం విద్యార్థుల జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తమ గురువుల పట్ల గౌరవం, అభిమానాన్ని చాటుకున్నారు.ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య సభ్యులు ఇనుకుల్ల దివాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వాహిని, పాఠశాల ప్రిన్సిపల్ తన్నీరు రామారావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుపై అధికారుల విచారణ



**పెద్దమందడి,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో బీసీలకు ప్రభుత్వం గతంలో కేటాయించిన ప్లాట్ల మధ్యలో ఉన్న బాటను కొందరు వ్యక్తులు కబ్జా చేశారంటూ గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన అధికారులు శనివారం గ్రామంలో విచారణ చేపట్టారు.పెద్దమందడి ఎంపీడీవో పరిణత ఆధ్వర్యంలో అధికారులు బాటను పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. గ్రామ సర్పంచ్ మంజుల శ్రీశైలం,మాజీ ఎంపీపీ మన్నెపు రెడ్డి సహకారంతో విచారణ కొనసాగింది. ప్లాట్ల మధ్య ఉన్న బాటను కొందరు ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ప్రజావాణిలో అందిన ఫిర్యాదును పరిశీలించి, సంబంధిత రికార్డులు మరియు క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. దీంతో బాట కబ్జా సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం



- **టీచర్స్ డే సందర్భంగా పలు పాఠశాలల్లో జమాత్ ఇస్లామీ హింద్ మహిళా విభాగం సందర్శన**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఉపాధ్యాయుల సేవలను, వారి త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబర్ 5న టీచర్స్ డే సందర్భంగా జమాత్ ఇస్లామీ హింద్ ఖమ్మం నార్త్ ఆధ్వర్యంలో మహిళా విభాగం పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు పుష్ప గుచ్ఛాలు, బహుమతులు అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, సెంచరీ స్కూల్, సిటిజన్ స్కూల్, బల్లేపల్లి ప్రభుత్వ పాఠశాల, ఖానాపురం ప్రభుత్వ పాఠశాల, ఇంద్రానగర్ ప్రభుత్వ పాఠశాల తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మహిళా విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా, వారిలో క్రమశిక్షణ, విలువలు, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు, త్యాగాలు సమాజానికి ఎంతో విలువైనవని కొనియాడారు. "ఉపాధ్యాయులు ఒక విద్యార్థి జీవితాన్ని మాత్రమే కాదు--- ఒక మంచి సమాజం మరియు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పి." ఈ కార్యక్రమంలో ఖమ్మం నార్త్ అధ్యక్షురాలు హుస్సైన్బీ , సబీహా, హఫీజా, తన్వీర్, తబస్సుమ్, సీమా, సాజిదా, ఆఫియా, ఫాతిమా జబీన్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ గుర్తింపు

- **చిన్నమ్మ థామస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వనపర్తి డైరెక్టర్**





**వనపర్తి,సెప్టెంబర్05(తెలంగాణ ముచ్చట్లు):-** బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్న జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వనపర్తి సంస్థల ఉద్యమానికి అంతర్జాతీయ గుర్తింపు లభించడం సంతోషంగా ఉందని రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వనపర్తి డైరెక్టర్ చిన్నమ్మ థామస్ తెలిపారు. నవంబర్ 27వ తేదీని బాల్య, చిన్న వయసులో జరిగే, బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. వనపర్తి జిల్లాలో బాల్య వివాహాల నివారణకు పాఠశాలలు, గ్రామాలు, పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చిన్నమ్మ థామస్ తెలిపారు. బాల్య వివాహాల ముప్పులో ఉన్న కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానించడం, బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ వ్యవస్థాపకుడు భువన్ రిభు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక అంతర్జాతీయ దినోత్సవం కోసం చేపట్టిన ప్రచారానికి పలు దేశాలు మద్దతు తెలిపాయని, సెప్టెంబర్ 4న ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు. బాల్య వివాహాల పూర్తిస్థాయి నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, అందుకోసం తమ సంస్థ కృషి కొనసాగిస్తుందని చిన్నమ్మ థామస్ పేర్కొన్నారు.

# ఉన్నత చదువులకు దూర విద్యా కేంద్రం.. సువర్ణ అవకాశం




**జవహర్ నగర్,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** ఉన్నత చదువులు అభ్యసించాలనుకునే వారికి సార్వత్రిక విద్య ద్వారా సువర్ణ అవకాశం కల్పిస్తున్నామని సిఆర్పిఎఫ్ డిఐజి డాక్టర్ వీర్రాజు తెలిపారు.
చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని అరుంధతినగర్లో ఉన్న సిఆర్పిఎఫ్ క్యాంపస్లో బీఆర్ఏ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో దూర విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ... విద్యను మధ్యలో నిలిపివేసిన వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దూర విద్య ద్వారా ఉన్నత విద్యను కొనసాగించవచ్చని తెలిపారు.
ఆన్లైన్లోనూ తరగతులు వినే అవకాశం ఉందని, తక్కువ ఫీజుతో డిగ్రీ అర్హతలు పొందవచ్చని చెప్పారు. దివ్యాంగులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.
సిఆర్పిఎఫ్ క్యాంపస్తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఐజి వీర్రాజు సూచించారు. విద్య ద్వారా తమ వృత్తి నైపుణ్యాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని అన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గడువు దాటితే అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.
మరింత సమాచారం కోసం సిఆర్పిఎఫ్ వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్ను 9559034477 నంబర్లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్తో పాటు సిఆర్పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్కారుకు సెగ పుట్టించిన... గులాబీ శ్రేణులు

- **వంట వార్పుతో.. దండు కట్టారు దడ పుట్టించారు.**
- **జాబ్ క్యాలెండర్ అంటూ ఊదరగొట్టి... విద్యార్థులను నిండా ముంచారు.**
- **వంటా వార్పుతో నైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి.**
- **మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి మహేందర్ రెడ్డి, మాజీ మేయర్ కావ్య.**





**జవహర్ నగర్ సెప్టెంబర్ 5, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజల బతుకులు ఆగమైపోయతాయని... ఉద్యమం చేసి మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణను సాధిస్తే కాంగ్రెస్ పాలనలో ఆకలి కేకల రాజ్యమేలుతున్నాయని పనులు దొరకపోవడంతో ప్రజలు దిక్కుతోచని దుస్థితిలో ఉన్నారని ఉద్యమ సమయంలోనే చేసిన వంటావార్పు మళ్ళీ చేయాల్సిన పరిస్థితి దాపురించిందని మేడ్చల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జి చామకూర మహేందర్రెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య దుయ్యబట్టారు.బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు కాంగ్రెస్ వైఫల్యాలపై చేపట్టిన వారం రోజులు నిరసన కార్యక్రమాల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో శనివారం వంట వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేందర్రెడ్డి మాజీ మేయర్ మేకల కావ్య హాజరై మాట్లాడుతూ మహిళలకు ఇస్తామన్న హామీలను ప్రభుత్వం మర్చిపోయిందని కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలపై కోర్టుల సాకుతో కాలం వెలుబుచ్చడం దారుణం అన్నారు. ఉద్యమ రోజులు గుర్తుకు వస్తున్నాయని ప్రజా పాలనలో ప్రజలవరు సంతోషంగా లేరని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి ఉద్యోగ కార్మిక సమస్యలు సహా ప్రతి రంగాన్ని కాంగ్రెస్ గాలికి వదిలేసిందన్నారు. ఉపాధి లేక యువత పెడదారణ పడుతుందని విద్యార్థులకు స్కాలర్షిప్లు విడుదల చేయలేకపోవడంతో యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కమిషన్లపై ఉన్న ఆసక్తి ప్రజాసేవపై లేదని ఎద్దేవ చేశారు. హామీలు నెరవేర్చేదాంక విశ్రమించేది లేదని అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. జవహర్ నగర్ బి ఆర్ ఎస్ హయాంలోనే ప్రగతి చెందిందని కాంగ్రెస్ నాయకులు అదే రోడ్డు మీద నిలబడి గొప్పలు పలకడం దయ్యాలు వేదాలు వల్లించినట్టు అవుతుందన్నారు. జవహర్ నగర్ నా గుండెకాయ అంటూ మల్లారెడ్డి జూబ్లీహిల్స్ తరహాలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ పాటలతో బిఆర్ఎస్ శ్రేణులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. వంటావార్పుతో నిరసన తెలుపుతూ 900 మంది పేద ప్రజలకు బిఆర్ఎస్ నాయకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్, ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సంగీత రాజశేఖర్, శ్రీవాణి, రవి, సతీష్, నాయకులు, వెంకటేష్ ప్రసాద్ గౌడ్, బాలరాజ్ పటేల్, పంతంగి సిద్ధులు యాదవ్, శ్రీరాములు, దిలీప్ అహ్మద్ పాషా, సాయి ,అశోక్, మహేష్, సోమయ్య, రాజేష్, విలాసాగర్ రవి, లక్ష్మణ్, ప్రశాంత్, కేతమ్మ, మంజుల, లక్ష్మి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఇల్లందుల శ్రీనివాస్

- **నియామక పత్రం అందజేసిన నియోజకవర్గ ఇన్ఛార్జి వొడితల ప్రణవ్**



**హుజూరాబాద్,సెప్టెంబర్ 05(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా జూపాక గ్రామానికి చెందిన ఇల్లందుల శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి వొడితల ప్రణవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారానికి నూతన నాయకత్వం కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.
తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు ఇల్లందుల శ్రీనివాస్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నేరెళ్ల మహేందర్, మండల అధ్యక్షుడు కొలుగూరి కిరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి మహేశ్, మాజీ ఎంపీటీసీ కేతిరి రాజిరెడ్డి, సమ్మక్క సారలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ దాసరి సదయ్య, మాజీ సర్పంచ్ పొలంపల్లి శ్రీనివాస్రెడ్డి, సీనియర్ నాయకులు తాళ్లపల్లి కుమార్, ఇల్లందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



**సత్తుపల్లి, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సత్తుపల్లి డివిజన్లోని మూడు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. ఖమ్మంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్, జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం, ఇతర విద్యాశాఖ అధికారులు అవార్డులను ప్రదానం చేశారు. సత్తుపల్లి డివిజన్ నుంచి సత్తుపల్లిలోని కేపీఆర్ గౌతమ్ మోడల్ స్కూల్ నిర్వాహకులు మందపాటి ప్రభాకర్రెడ్డి, విశ్వశాంతి విద్యాలయం నిర్వాహకులు పసుపులేటి నాగేశ్వరరావు, కల్లూరులోని బాలాజీ స్కూల్ నిర్వాహకులు వలసాల బాలాజీ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను జిల్లా అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. విద్యారంగానికి ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు అందిస్తున్న సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వరి కొయ్యకాళ్లతో అదనపు ఆదాయం పొందొచ్చు



- **రైతులు వాటిని కాల్చకుండా సహజ వాయు ప్లాంట్లకు తరలించాలి**

**ఇల్లందకుంట, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం మల్యాల రైతువేదికలో వ్యవసాయశాఖ, ఆత్మ ఆధ్వర్యంలో 'రికగ్నిషన్ ప్రియర్ లెర్నింగ్' శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంట అవశేషాల వినియోగంపై అవగాహన కల్పించారు.

జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్ మాట్లాడుతూ రైతులు వరి కొయ్యకాళ్లను పొలాల్లో కాల్చకుండా సహజ వాయు ప్లాంట్లకు తరలించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం వల్ల రైతులకు ఆర్థిక ప్రయోజనం కలగడంతో పాటు కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు.

ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు సునీత అన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ అధునాతన శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించాలని సూచించారు. పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగంలో శాస్త్రీయ విధానాలను అనుసరిస్తే ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొని పలు అంశాలపై అవగాహన పొందారు.

# గురువుల సేవలు మరువలేనివి



- **ఇల్లందకుంట పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

**ఇల్లందకుంట, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ నజ్మీన్ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావంతో మెలుగుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు మంచి నడవడిక, విలువలను అలవర్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.

ఉపాధ్యాయుడు సిహెచ్. వేణు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి కలకత్తా విశ్వవిద్యాలయానికి బదిలీ అయిన సందర్భంలో ఆయనకు విద్యార్థులు చూపిన గురుభక్తిని వివరించారు. ఆయనను రైల్వే స్టేషన్‌కు సాగనంపేందుకు విద్యార్థులు గుర్రపు బండికి కట్టిన గుర్రాలను తొలగించి, తామే బండిని లాగుతూ తీసుకెళ్లిన సంఘటన గురువుల పట్ల విద్యార్థులకు ఉన్న గౌరవానికి నిదర్శనమన్నారు. నేటి విద్యార్థులు కూడా గురువుల పట్ల గౌరవం, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. జయప్రకాష్, కే. సత్యం, ఎం. సమిరెడ్డి, జి. అన్నపూర్ణ, ఏ. సురేష్, సిహెచ్. రామకృష్ణ, కే. శంకర్, రాధిక రాణి, శైలజ, ఎం. ఐలయ్య, ఆర్. దేవేందర్, యు. లక్ష్మణాచారి, ఎం. స్రవంతి, డి. పరమేశ్వర్, వనిత, వినీతతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయుడిగా అరుణ్



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్ ప్రిన్సిపల్ చావా అరుణ్ కుమార్ ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, డీఈవో సదానందం చేతుల మీదుగా మెమెంటో, ప్రతిభా పురస్కారం అందుకున్నారు. 28 సంవత్సరాలుగా విద్యారంగంలో చేస్తున్న సేవను పురస్కరించుకొని ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్ ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, ఎంఈఓ సలాది రామారావు, వైరా డివిజన్ అధ్యక్షుడు బోడేపూడి కిరణ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మనలోని అజ్ఞానపు పొరలను తొలగించి.. జ్ఞానదీప్తిని వెలిగించేవారే ఉపాధ్యాయులు —— మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్




**జవహర్ నగర్, సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శకులని.. మన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికులని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని.. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా జవహర్ నగర్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆయన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందజేసి.. శాలువాలతో ఘనంగా సన్మానించి ఉపాధ్యాయుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రెడ్డి శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అమ్మానాన్నల తర్వాత సమాజంలో గురువులకు అత్యున్నత స్థానం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

అనంతరం ప్రధానోపాధ్యాయుడు ఆజమ్ మొద్దీన్ మాట్లాడుతూ.. పాఠశాలలో ఏ సమస్య ఉన్నా రెడ్డి శెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. విద్యార్థుల చదువు కోసం ఎలాంటి సహాయం కోరినా ముందుండి సహకరిస్తున్న మంచి మనసున్న నాయకుడిగా ఆయనను కొనియాడారు.

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరపున మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చందర్ రావు, రాజు యాదవ్, సహదేవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ రణభేరి

- **విద్యార్థులు, నిరుద్యోగులతో సండ్ర వెంకట వీరయ్య ర్యాలీ.**






**సత్తుపల్లి, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను 1000 రోజులు పూర్తయినా అమలు చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. బీఆర్ఎస్ చేపట్టిన '1000 రోజుల కాంగ్రెస్ పాలన వైఫల్యాలపై పోరుబాట'లో భాగంగా సత్తుపల్లిలో శనివారం విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ అతిథిగృహం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. యువత, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. 100 రోజుల్లో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, 1000 రోజులు గడిచినా ఆ హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు, విద్యా భరోసా కార్డుల హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, గురుకుల విద్యా వ్యవస్థను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సండ్ర ఆరోపించారు. ప్రతి జిల్లాలో యూపీఎస్సీ ఉచిత కోచింగ్ కేంద్రం ఏర్పాటు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, పోటీ పరీక్షల దరఖాస్తు రుసుముల మినహాయింపు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లోని హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. హామీలను అమలు చేయకపోతే కేటీఆర్ నాయకత్వంలో విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు

- **గంగారంలో రైతులకు అవగాహన కల్పించిన కేవీకే శాస్త్రవేత్త విజయ్**



**వీణవంక, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేందుకు రైతులు ఆధునిక సాగు పద్ధతులను పాటించాలని కేవీకే శాస్త్రవేత్త విజయ్ సూచించారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం గంగారం గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన పంటల సాగు విధానాలపై రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ విధానాలు, తక్కువ నీటితో వరి సాగు చేసే పద్ధతులపై శాస్త్రీయ అవగాహన కల్పించారు. యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటల ఎంపిక, నీటి యాజమాన్యం, సాగు విధానాల్లో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రవణ్, ఏటీఎం స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో హామీలన్నీ గాలికే

- **ఉద్యోగ నోటిఫికేషన్ లేక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.**
- **నాగులవంచలో బీఆర్ఎస్ యువత సమరభేరి.. వంటావార్పుతో నిరసన**
- **నిరుద్యోగ యువతను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది: మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు**




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** చింతకాని మండల పరిధిలోని నాగులవంచలో వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు నిరుద్యోగ యువతతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం నాగులవంచ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంటావార్పు కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు. అనంతరం వంకాయలపాటి సత్యనారాయణ నివాసం వద్ద ఏర్పాటు చేసిన షేక్ రహమతుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

ఎన్నికల సమయంలో వందలాది హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెయ్యి రోజుల పాలన పూర్తయినా వాటిని సక్రమంగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని కమల్ రాజు ఆరోపించారు. యువతకు ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, దివ్యాంగులకు రూ.6,000, విద్యార్థినులకు స్కూటీలు, రైతులు, రైతు కూలీలు, ఆటో కార్మికులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటివరకు ఆరు లక్షల ఉద్యోగాలు ఎందుకు భర్తీ చేయలేదని కమల్ రాజు ప్రశ్నించారు. ఉద్యోగాలు లేక విద్యావంతులైన యువత తీవ్ర నిరాశలో ఉందని, ఉద్యోగ నోటిఫికేషన్ లేక నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని, వారికి ఉపాధి కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన యూత్ డిక్లరేషన్ హామీలను ఇకనైనా యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పి రాజీవ్ యువ వికాసం పేరుతో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని కమల్ రాజు ఆరోపించారు. ఈ పథకం కోసం రూ.600 కోట్ల బడ్జెట్ కేటాయించామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పటివరకు దానిని అమలు చేయలేదని విమర్శించారు. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో విఫలమై, మరోవైపు స్వయం ఉపాధి కల్పించే పథకాలను కూడా అమలు చేయకుండా నిరుద్యోగ యువత ఆశలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపిస్తూ, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కింద రూ.11,300 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులతో పాటు కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీ కూడా ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే జీవో 97ను వెంటనే రద్దు చేయాలని కమల్ రాజు డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడే విధానాన్ని మానుకోవాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని, దివ్యాంగులకు రూ.6,000 అందిస్తామని ఇచ్చిన హామీని కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆ హామీలను కూడా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని కమల్ రాజు అన్నారు. రైతుబంధు, రైతు రుణమాఫీ వంటి అంశాల్లో గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కూడా మోసం చేసిందని విమర్శించారు. అవసరమైన సమయంలో రైతులకు యూరియా కూడా సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. మొత్తం 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించి ప్రజలను మోసం చేసిందని కమల్ రాజు ధ్వజమెత్తారు. యువత, మహిళలు, దివ్యాంగులు, విద్యార్థులు, రైతులు, రైతు కూలీలు, ఆటో కార్మికులు సహా అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు కాని వాగ్దానాలను ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజలతో చర్చలు నిర్వహిస్తూ, సోషల్ మీడియా ద్వారా కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అమలు కాని హామీలపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మండల నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ గురజాల హనుమంతరావు, మాజీ ఎంపీటీసీ వంకాయలపాటి సత్యనారాయణ, యువజన నాయకులు జావీద్, కోపూరి నవీన్, నాదెండ్ల వెంకటేష్, మీరా సాహెబ్.. వివిధ గ్రామాల సర్పంచులు చాపల మడుగు వీరబాబు, కోడూరి పరిశుద్ధ రావు, ఉప సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## కాంగ్రెస్‌లోకి కోర్కల్ సర్పంచ్.. 150 మంది చేరిక

- **సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, కుల సంఘాల ప్రతినిధులు పార్టీ తీర్థం**

**వీణవంక, సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):**కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ దూకుడు కొనసాగుతోంది. మండలంలోని కోర్కల్ గ్రామ సర్పంచ్ రమ్యకృష్ణ-అనిల్, వార్డు సభ్యులు, కుల సంఘాల అధ్యక్షులు, వివిధ పార్టీలకు చెందిన సుమారు 150 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ఇసుకపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు ఇసుక ట్యాక్స్ ద్వారా ఉపాధి కల్పించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. గ్రామంలోని పలు సమస్యలను ప్రణవ్ దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు: వొడితల ప్రణవ్**

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా భారీగా నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమన్నారు.

కోర్కల్ గ్రామ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, అవసరమైన నిధులు కేటాయించి గ్రామంలోని సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు చేపడతామని ప్రణవ్ తెలిపారు. కార్యక్రమంలో వీణవంక మండల ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్షుడు, మండల నాయకులు, మైనారిటీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురువుకు వందనం.. జ్ఞానానికి అభివందనం

- **ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**
- **గురువులను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దలీప్**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సేవ పథకం ఆధ్వర్యంలో గురువుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా హాజరై అధ్యాపకులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గురువుకు వందనం.. జ్ఞానానికి అభివందనం" అని పేర్కొన్నారు. జీవితంలో మనకు దిశానిర్దేశం చేసిన ప్రతి గురువును స్మరించుకునే రోజే ఉపాధ్యాయ దినోత్సవమన్నారు. అక్షరాలు నేర్పిన తొలి గురువు నుంచి జీవిత విలువలను బోధించిన ప్రతి ఉపాధ్యాయుడి కృషి విద్యార్థుల ఎదుగుదలలో చెరగని ముద్ర వేస్తుందని తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. పేదరికం ఆయనకు అడ్డంకి కాలేదని, అవకాశాల కొరత లక్ష్యాన్ని ఆపలేదని, నిరంతర అధ్యయనం, జ్ఞాన పిపాస, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించారని గుర్తుచేశారు. అందుకే సెప్టెంబర్ 5 కేవలం వేడుక మాత్రమే కాదని, గురువు విలువను గుర్తుచేసుకునే రోజని అన్నారు.విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయ్యేలా తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం. కుమార్, జాతీయ సేవ పథకం అధికారులు కే. తిరుపతి, ఈ. జ్యోత్స్నాదేవకి, అధ్యాపకులు చ. విశ్వనాథ్ రెడ్డి, జి. ప్రభాకర్, డి. మహేష్, ఎం. శ్రీధర్, ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

- **మాచనపల్లిలో 10 మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 5 (తెలంగాణ ముచ్చట్లు):** ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అండగా నిలుస్తోంది. జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామంలో పది మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు గ్రామ సర్పంచ్ పర్లపల్లి విజయ్ కుమార్ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ప్రొసీడింగ్ కాపీలను అందజేయడంతో గ్రామంలో సంతోషకర వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ విజయ్ కుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా గ్రామస్థాయిలో ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని చెప్పారు. పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కలుగుతోందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు.

కార్యక్రమంలో వార్డు సభ్యులతో పాటు మాచనపల్లి గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు ఓరుగంటి రవీందర్ రావు, వేల్పుల ప్రశాంత్, గుర్రపు సంపత్ రెడ్డి, ముష్కి సదానందం, ఇటుకల సదానందం, వేల్పుల గణేష్, రంజిత్, అన్వేష్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి

- **ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్ కోసం బీఆర్ఎస్ డిమాండ్.**
- **మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.**



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం అశ్వారావుపేటలో విద్యార్థులు, నిరుద్యోగ యువతతో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలని నినాదాలు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహించిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గురుకులాలను అభివృద్ధి చేసి పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించామని మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. జిల్లాకో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి వైద్య విద్యను సామాన్యులకు చేరువ చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్ పేరుతో యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు గడిచినా 13 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని ఉప్పల వెంకటరమణ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగాలకు ప్రస్తుతం నియామక పత్రాలు అందజేసి తామే ఉద్యోగాలు కల్పించినట్లు కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ''మేము భర్తీ చేసిన ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి గొప్పలు చెప్పుకుంటారా? నియామక పత్రాలు ఇస్తే కాంగ్రెస్ ఉద్యోగాలు ఇచ్చినట్టేనా?'' అని ప్రశ్నించారు. యువతకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రపంచానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులే

- **కొత్తపల్లి గార్డియన్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 05 (తెలంగాణ ముచ్చట్లు):** ఉపాధ్యాయులు ప్రపంచానికి మార్గదర్శకులని, అన్ని వృత్తులకు రూపకల్పన చేసే గొప్ప వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ అన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం కొత్తపల్లిలోని గార్డియన్ పాఠశాలలో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకూస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐ రామకృష్ణ గౌడ్ హాజరయ్యారు. తొలుత డా. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని, క్రమశిక్షణతో మెలుగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో మంచి పేరు, ప్రతిష్టలు సాధించేలా ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయ బృందాన్ని శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీటీఎల్ఏ అధ్యక్షుడు రహమాన్, సీనియర్ జర్నలిస్టులు నసిరుద్దీన్, యూసుఫ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే సమాజానికి మార్గదర్శకులు.!



**సత్తుపల్లి, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):**విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా వారిలో క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం సత్తుపల్లి పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఉన్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి దయానంద్ విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మెయిన్ రోడ్డులోని రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా స్మరించుకున్నారు. పాత సెంటర్‌లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సమాజంలో విద్యకు ప్రత్యేక స్థానం ఉందని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని దయానంద్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాధాకృష్ణన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల్లో జ్ఞానంతో పాటు మానవీయ విలువలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, వార్డు కౌన్సిలర్లు, మండల విద్యాశాఖ అధికారి, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫాదర్ కొలంబో పాఠశాలలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు




- **ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం**
- **ప్రిన్సిపాల్ థామస్ కిరణ్**

**స్టేషన్ ఘనపూర్,సెప్టెంబర్5(తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్‌లోని ఫాదర్ కొలంబో పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఆనందోత్సాహాల నడుమ జరిగిన ఈ వేడుకలు సందడిగా సాగాయి. కార్యక్రమంలో భాగంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల ప్రాధాన్యతను చాటిచెప్పేలా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, కళా ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను సరైన దిశలో నడిపిస్తూ, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులను ఉన్నత విలువలతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల లక్ష్యమని పేర్కొన్నారు. టీచర్స్ డే సందర్భంగా విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అభిమాన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సత్కరించి, ప్రేమాభిమానాలతో బహుమతులు అందజేశారు. దీంతో పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సరళ రెడ్డి మృతి అత్యంత బాధాకరం....

- **టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ రాష్ట్ర కార్యదర్శి బొల్లి వెంకటరాజు**
- **సీనియర్ రిపోర్టర్ అనిల్ రెడ్డి ని పరామర్శించిన వెంకట్ రాజు అన్నెం సత్యాలు**



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** టీవీ9 సీనియర్ రిపోర్టర్ కర్ర అనిల్ రెడ్డి సతీమణి సరళ రెడ్డి మృతి అత్యంత బాధాకరమని ఆమె లేని రోడ్డు ఎవరు తీర్చలేరని టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి బొల్లి వెంకటరాజు అన్నారు. శనివారం మాజీ జెడ్పిటిసి అన్నెం సత్యనారాయణమూర్తి (సత్యాలు) తో కలిసి సరళ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి రిపోర్టర్ అనిల్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ సరళ రెడ్డి చిన్ననాటి నుండి టైలరింగ్ బోటిక్ వంటి వృత్తిలో రాణిస్తూ భర్తకు సహకారంగానే కాక ఎంతో మంది మహిళలకు ఉపాధి చూపించే వారిని అన్నారు. అనిల్ రెడ్డి మీడియా రంగంలో అత్యున్నత స్థాయిలో ఉండటానికి సరళ రెడ్డి సహకారం మరువలేనిదని అన్నారు. చిన్న వయసులోనే సరళ రెడ్డి మృతి చెందటం విషాదకరమని అనిల్ రెడ్డి కుటుంబానికి సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు. భార్య వియోగం బాధ నుండి అనిల్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాలి. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు అనిల్ రెడ్డి స్నేహితులు పాల్గొని సరళ రెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# 22-ఏ భూముల సమస్యపై బీజేపీ పోరుబాట

- **రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలి: పానుగంటి బాబు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 ( తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా కారణంగా రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సమస్యపై ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో బీజేపీ ప్రజల పక్షాన పోరాటం చేస్తోందని జవహర్‌నగర్ మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారని పానుగంటి బాబు పేర్కొన్నారు.
మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ధర్నా కార్యక్రమానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. 22ఏ నిషేధిత జాబితాలో భూములు చేర్చడం వల్ల తమ సొంత భూములను విక్రయించుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక రైతులు, భూయజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 22ఏ భూముల సమస్యకు ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కోసం బీజేపీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. రైతుల భూముల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన ఏనుగు సుదర్శన్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
ఈ ధర్నా కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

# తొక్కించిన 385 బుల్లెట్ సైలెన్సర్స్ వేలం

- **ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** రోడ్ రోలర్ తో తొక్కించిన 385 బుల్లెట్ సైలెన్సర్స్ ని ఆగస్టు 7 న పోలీస్ హెడ్ క్వాటర్స్ లో గల పోలీస్ శిక్షణ కేంద్రంలో పాత ఇనుప దుకాణదారులకు వేలం పాట నిర్వహించి అప్పగించడం జరుగుతుందని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లలో నిబంధనలు విరుద్ధంగా బుల్లెట్ వాహనాలకు అమర్చి నడుపుతున్న సుమారు 385 బుల్లెట్ సైలెన్సర్లను సీజ్ చేసి తొలగించడం జరిగిందని, నిబంధనలు ప్రకారం సోమవారం రోజున ఖమ్మం పోలీస్ శిక్షణ కేంద్రం నందు రోడ్ రోలర్ తో తొక్కించి, అనంతరం సైలెన్సర్స్ ని వేలం పాట నిర్వహించి పాత ఇనుప దుకాణదారులకు అప్పగించడం జరుగుతుంది. ఆసక్తి కలిగిన వ్యాపారులు వేలం పాటలో పాల్గొనాలని విజ్ఞప్తి చేసారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు




- **రౌడీషీటర్లపై నిరంతరం నిఘా**
- **వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్ లో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ..గణేష్ ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, ప్రతి మండపం వద్ద భద్రతా చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.నిమజ్జనం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీ ప్రాంతాల్లో తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని సూచించారు. విగ్రహాల ఊరేగింపులో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనడం వంటి వాటిపై నిఘా ఉంచాలన్నారు. గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీస్ శాఖకు సహకరించాలని పోలీస్ కమిషనర్ కోరారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటీలు, గణేష్ మండపాల నిర్వాహకులతో వేరువేరుగా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు.
రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.
రౌడీషీటర్ల ప్రస్తుత కార్యకలాపాలు, కదలికలు, వారి పరిచయాలు, వివాదాలకు సంబంధించిన అంశాలపై స్థానిక పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పండుగలు, ఉత్సవాలు, ముఖ్యమైన కార్యక్రమాల సందర్భంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రౌడీ షీటర్ల కదలికలను పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వారిని ఉపేక్షించకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ లో ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకలు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):**ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం శ్రీకృష్ణ ప్రసాద్ మెమోరియల్ పోలీస్ సంక్షేమ పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ, విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని



పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల తమ గౌరవాన్ని చాటుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠ్యాంశ బోధించి ఆకట్టుకున్న విద్యార్థులు సోహిత్, ఆసియా ఫిర్దోస్, హర్షిత లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నర్సయ్య, ఆర్ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాజు, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేటీఆర్ 'యువ సమర భేరీ' అట్టర్ ఫ్లాప్

- **అధికారం పోయాకే యువత గుర్తుకొచ్చిందా? – మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన 'యువ సమర భేరీ' కార్యక్రమం పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయిందని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో యువత సమస్యలను పట్టించుకోని కేటీఆర్‌కు అధికారం కోల్పోయిన తర్వాతే యువత గుర్తుకొచ్చిందా? అని ప్రశ్నించారు.
శనివారం కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మేయర్.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రజల మధ్య ఎదిగిన బండి సంజయ్‌ను విమర్శించే ముందు కేటీఆర్ తన రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని హితవు పలికారు.




బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగ భృతి, ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షలు, పేపర్ లీకేజీలు, 317 జీవో వంటి అంశాలతో యువత, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. యువతకు ఇచ్చిన హామీలపై కేటీఆర్ ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంతో పాటు శాతవాహన యూనివర్సిటీకి 12బీ హోదా, ఎస్ఆర్ఆర్ కళాశాలకు అటానమస్ హోదా సాధించడంలో కీలకంగా కృషి చేశారని తెలిపారు. సిరిసిల్ల అభివృద్ధికి కేటీఆర్ తెచ్చిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు.
ఎన్ని రాజకీయ సభలు నిర్వహించినా యువతను మోసం చేసిన బీఆర్ఎస్ చరిత్రను ప్రజలు మరిచిపోరని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.

# పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. పలు కుటుంబాలకు భరోసా

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** వివిధ కారణాలతో ఇటీవలి కాలంలో మృతి చెందిన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన 38మందికి పైగా కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి.. ఒక్కో కుటుంబానికి రూ.10,000 చొప్పున ఆర్థిక సాయాన్ని.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా



మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారి తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆపద కాలంలో ఆర్థికంగా అండగా నిలిచిన పీఎస్ఆర్ ట్రస్ట్ కు.. మృతుల కుటుంబ సభ్యులు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమాల్లో :మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, పొంగులేటి అభిమానులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరంలో మాజీ ఎంపీ నామ, ఎంపీ వద్దిరాజు పర్యటన

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం నగరంలో శనివారం సాయంత్రం బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా నెహ్రూనగర్‌లో నూతనంగా ప్రారంభించిన డాక్టర్ జ్యోత్స్న మెటర్నిటీ, ఫెర్టిలిటీ హాస్పిటల్‌ను వారు సందర్శించారు. ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రీకాంత్ పెద్దినేని, డాక్టర్ జ్యోత్స్న పెద్దినేని వారికి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, వార్డ్ రూమ్స్, ల్యాబ్‌తో పాటు ఇతర వైద్య సదుపాయాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం నగరంతో పాటు పరిసర ప్రాంతాల



ప్రజలకు మెరుగైన ప్రసూతి, ఫెర్టిలిటీ వైద్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం హాస్పిటల్ యాజమాన్యం పెద్దినేని క్రిష్ణమూర్తి, డాక్టర్ శ్రీకాంత్ పెద్దినేని, డాక్టర్ జ్యోత్స్న పెద్దినేని ఆధ్వర్యంలో నామ, వద్దిరాజు లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**నూతన వధూవరులకు మాజీ ఎంపీ నామ ఆశీర్వాదం**

టేకులపల్లి గ్రామం, ఖానాపురం హవేలీ వాస్తవ్యులు, ఖమ్మం మాజీ సుడా డైరెక్టర్ దొంగల తిరుపతిరావు ఇందిరల కుమార్తె వివాహం ఇటీవల వీరబాబుతో జరిగిన సందర్భంగా శనివారం నాడు వారి స్వగృహానికి ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

**చింతల లింగయ్య కుటుంబానికి మాజీ నామ పరామర్శ**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత చింతల లింగయ్య ఇటీవల పరమపదించిన నేపథ్యంలో శనివారం నాడు వారి స్వగృహానికి నామ వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లింగయ్య ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# ఖమ్మంలో కదం తొక్కిన బీఆర్ఎస్ యువత...పాల్గొన్న మాజీ ఎంపీ నామ, మాజీ మంత్రి పువ్వాడ




**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 5(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అబద్ధపు మాటలు చెప్పి, అలవికాని హామీలు, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి కేసీఆర్ గారిని ఓడించలేమని భావించి, ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీని కూడా తెలంగాణకు తీసుకొచ్చి ఆయనతో సైతం చెప్పించి సమాజంలోని అన్ని వర్గాల వారిని మోసం చేసిన ఘనత తెలంగాణ కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ యువత పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఖమ్మం నగరం, మధిర అసెంబ్లీ నియోజకవర్గం చింతకాని మండలం నాగులవంచలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత, విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. భారతదేశ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లా ఏ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేయలేదని పేర్కొన్నారు. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే నిరుద్యోగుల పట్ల వివక్ష చూపారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మూడేళ్ల పాలనలో ఆరు లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందని, కానీ ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని మండిపడ్డారు. తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను చదివిస్తే, ఈ రోజు యువతకు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ప్రతి నెలా మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, 33 నెలలకు రూ.82,500 బకాయి ఉన్నారని, దివ్యాంగులకు రూ.6,000 ఇస్తామని హామీ ఇచ్చి రూ.66,000 బకాయి ఉన్నారని అన్నారు. ఆడపిల్లలకు ఉచిత స్కూటీలు ఇస్తామని ఇచ్చిన హామీని కూడా నెరవేర్చలేదని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నేరుగా రైతుల ఖాతాల్లో లక్ష కోట్ల రూపాయలు జమ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతే రాజుగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతుబీమా, రైతు కూలీల విషయం, పంట కొనుగోళ్లు, ఎరువుల విషయంలో తీవ్రంగా మోసం చేసిందని ఆరోపించారు. నాడు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం ఇబ్బంది పడకుండా ఉండాలని కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల గురించి 17వ లోక్‌సభలో మాట్లాడితే పార్లమెంట్‌లో అందరూ ఆశ్చర్యపోయారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాలకు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పిందని, ప్రస్తుతం ఆ పథకాలను కూడా నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇటీవల జెన్ జీ యువత పార్లమెంట్ సాక్షిగా ఉద్యమం చేస్తే కేంద్రం దిగివచ్చిందని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా రానున్న రోజుల్లో యువత గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పరిపాలన చేతకాక తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై విమర్శలు చేయడం చాలా బాధగా అనిపిస్తోందన్నారు. స్వాతంత్ర్యం కోసం నాడు గాంధీ చేసిన పోరాటం మాదిరిగా, కాంగ్రెస్ పాలిస్తున్న సమయంలో కేసీఆర్, ఉద్యమకారులు, సకల జనుల పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. తాను కూడా 15వ లోక్‌సభలో కేసీఆర్‌తో కలిసి పార్టీలకు అతీతంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన విషయాన్ని, పార్లమెంట్‌ను స్తంభింపజేసిన సందర్భాన్ని మరోమారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాంటి కేసీఆర్‌పై నిజమైన తెలంగాణవాదులు ఎవరూ విమర్శలు చేయరని, కనీసం మాట కూడా అనలేరని పేర్కొన్నారు. తెలంగాణ యువత ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామాల్లో చర్చ పెట్టాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ శ్రేణులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in